సాక్షి గుంటూరు

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



అన్నా..జగన్‌తో కరచాలనం చేస్తున్న మహిళలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
గుంటూరు	6.27	4.40
నరసరావుపేట	6.29	4.42
బాపట్ల	6.27	4.40



వినుకొండలో బస్సు యాత్రకు హాజరైన జనసందోహంలో ఓ భాగం, ఇన్‌సెట్‌లో ఓ అవ్వ బాధను ఆలకిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అభిమాన ప్రభంజనం



బస్సు నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, పక్కన ఎమ్మెల్యే బొల్లా



మరో ప్రభంజనానికి నాందిలా
మహోజ్వలిత చరితకు స్ఫూర్తిలా..
మహా సంగ్రామంలో సైనికుల్లా...
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగమనంతో
పల్నాట పల్లెలు, పట్టణాలు పరవశిస్తున్నాయి..
పాదం పాదం కలుపుతూ కదం తొక్కుతున్నాయి..
చేయి చేయి కలిపి సంఘటితమవుతున్నాయి
'మేమంతా సిద్ధం' యాత్రలో ఉరకలెత్తుతున్నాయి..
రేపటి వెలుగులకు దిక్సూచిగా మారుతున్నాయి..
రాజన్న బిడ్డ వెంటే మేమంటూ ...
రావాలి మళ్లీ మీరే మా ముఖ్యమంత్రిగా అంటూ
జయ జయ జయహో అంటూ జేజేలు పలుకుతున్నాయి...
జగన్నినాదానికి గొంతుకలవుతున్నాయి..



నిలువెత్తు అభిమానం...వైఎస్ జగన్‌కు గజమాలతో స్వాగతం

- పల్నాడు గడ్డపై అడుగిడిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- అడుగడుగునా జననీరాజనం
- సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- దారిపొడవునా పూలవర్షం కురిపించిన అభిమాన జనసందోహం
- మార్మోగిన జగన్నినాదం

సాక్షి ప్రతినిధి,గుంటూరు/సాక్షి,నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడులో ప్రవేశించింది. సంక్షేమ సారధికి ప్రజలు నీరాజనాలు పలికారు. అభిమానం ఉప్పొంగింది. మండు వేసవిలోనూ దారి పొడవున సంతోషాల జల్లు కురిసింది. భగభగ మండే భానుడు సైతం ప్రజాభిమానం ముందు మూగబోయాడు. ఎండను కూడా లెక్క చేయకుండా తమ అభిమాన నేత కోసం మహిళలు, అవ్వలు, తాతలు రోడ్లపై వేచి చూశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర వినుకొండ నియోజకవర్గంలో ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. చిన్నారుల కేరింతలు..విద్యార్థుల సంబరాలు... యువత ఆనందోత్సాహాలు..మహిళల అభిమానం నడుమ బస్సు యాత్ర ముందుకు కదిలింది.

చింతలచెరువులో ఘనస్వాగతం

తొలుత వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం చింతలచెరువు గ్రామంలోకి ప్రవేశించింది. తమ అభిమాన నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, చిలకలూరిపేట అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు, పార్టీ నాయకులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు ఉత్సాహంతో కదం తొక్కారు.

ఆప్యాయంగా పలకరిస్తూ...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సులో నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఐనవోలు గ్రామంలో దివ్యాంగులైన చంద్ర ప్రసన్న, చంద్ర చంద్రశేఖర్‌లు మండుటెండను లెక్కచేయకుండా సీఎం రాక కోసం వేచి ఉన్నారు. ఇది గమనించిన సీఎం వారిని పలుకరించారు. దీంతో వారి సంతోషానికి అవధుల్లేవు. సీఎం జగన్ మాట్లాడుతూ మరలా మనందరి ప్రభుత్వం వస్తుందని మనందరి ప్రభుత్వంలో మీకు తగిన మేలు జరుగుతుందని హామీ ఇచ్చారు.

సమస్యలు వింటూ.. పరిష్కారం చూపుతూ

బాధితుల సమస్యలు సీఎం వైఎస్ జగన్ ఓపికగా విన్నారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసి వెంటనే పరిష్కారం అయ్యేలా చూశారు. నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన దంపతులు కీర్తిపాటి వేణుకుమార్, అనురాధలు తమ కుమార్తె ప్రైజీ(9) కంటి సమస్యను జగనన్న దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా వారి అర్జీని తెప్పించుకొని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అర్జీ అందుకున్న గంటల వ్యవధిలోనే సీఎంఓ కార్యాలయం నుంచి తండ్రికి ఫోన్ కాల్ రావడంతో, తమ చిన్నారి సమస్య పరిష్కారానికి మార్గం సులభతరం కావస్తుండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తమ హృదయాలలో పెట్టుకొంటామంటూ సంతోషం వ్యక్తం చేశారు.

- శావల్యాపురం మండలం కారుమంచి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మల్లాపరపు పున్నారావు-రుున్సీలు తమ కూతురు రోహిణి ఐదు సంవత్సరాల నుంచి వెన్నపూస వ్యాధితో బాధపడుతుందని పలు వైద్యశాలలో వైద్య చికిత్స చేయించినా నేటి వరకు పురోగతి లేదని దానికితోడు ఆరోగ్యశ్రీ కార్డు వర్తించలేదని రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వివరించారు.
- మండలంలోని భాస్కర్‌నగర్ గ్రామానికి చెందిన సజ్జా సౌజన్య తన భర్త పాముకాటుతో మృతి చెంది సంవత్సరాల గడుస్తున్నా నేటి వరకు ప్రభుత్వ పరంగా బీమా రూ.5 లక్షల మంజూరు కాలేదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తెలిపారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కారిస్తామని హామీ ఇవ్వటంతో బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.
- బస్సు యాత్ర సీతారామపురం జంక్షన్ వద్దకు చేరుకోగానే మోదుగుల వెంకటేశ్వరమ్మ అనే మహిళ డాక్టర్ నడవలేని స్థితిలో ముఖ్యమంత్రి కాన్వాయ్ దగ్గరకు చేరుకుంది. ఆమెను చూసిన జగన్ వెంటనే బస్సు ఆపి ఆమె వద్దకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. తనకు సీతారామపురం గ్రామంలో 2.46 ఎకరాల భూమి ఉందని, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అనుచరులు ఆక్రమించుకొని 80 సెంట్లు మాత్రమే రెవెన్యూ రికార్డులో భూమి ఉన్నట్లు చూపించారని ముఖ్యమంత్రికి వివరించింది. సమస్యను పరిష్కరించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

జనకొండ... వినుకొండ

వినుకొండ వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. జననేత బస్సు యాత్రకు సంఘీభావం తెలిపేందుకు వేలాది మంది ప్రజలు దారిపొడువునా నిలబడి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు భారీ గజమాలలను క్రేన్ల సహాయంతో దారి పొడువునా ఉంచి వైఎస్ జగన్‌ను పట్టణంలోకి ఆహ్వానించారు. చీకటీగలపాలెం వద్ద పెద్దఎత్తున ముస్లిం మహిళలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బస్సు వినుకొండ చెక్‌పోస్టు సెంటర్ వైపుగా వెళ్లింది. తన కోసం మండుటెండలో వేచి చూస్తున్న అభిమానులకు బస్సు టాప్ నుంచి అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకు సాగారు. బస్సుపైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ఆయన వెంట ఉండి ప్రజలకు అభివాదం చేశారు. అటు నుంచి శివయ్య స్థూపం సెంటర్‌మీదుగా రైల్వేస్టేషన్ రోడ్డు, నిర్మలా స్కూల్ మీదుగా వినుకొండ పట్టణంలో బస్సు యాత్ర సాగింది.



నమస్తే మామ...చిన్నారి ఆనందం



అభిమాన నేతను చూసేందుకు వచ్చిన మహిళలు

అభిమాన నేతను చూసిన ఆనందం



చిన్నా...జగన్ మామయ్య కనిపించారా

వినుకొండ నుంచి విఠంరాజుపల్లి, కనమర్లపూడి గ్రామాల మీదుగా బస్సు యాత్ర సాగింది. అడుగడుగున మహిళలు, యువత రోడ్డుపై నిల్చుని కాన్వాయ్‌ని ఆపి తమ అభిమాన నేతను తనివితీరా చూశారు. దారిమధ్యలో నిల్చుని తమ సమస్యలు తెలిపిన వారికి అక్కడిక్కడే వైఎస్ జగన్ పరిష్కార మార్గం చూపారు. అక్కడి నుంచి శావల్యాపురం, పోట్లూరుల మీదుగా యాత్ర సాగింది. రాత్రి 8 గంటలైన రోడ్డుపై బస్సు యాత్ర కోసం వేచి చూసి జననేతకు ఘన స్వాగతం పలికారు. తర్వాత గంటావారిపాలెం గ్రామంలో అభిమానులకు సీఎం అభివాదం చేసుకుంటూ యాత్ర సాగి, రాత్రి 8.30 గంటలకు గంటావారిపాలెం శివారులో ఏర్పాటుచేసిన బస శిబిరానికి సీఎం చేరుకున్నారు. దీంతో తొలిరోజు పల్నాడు జిల్లాలో మేమంతా సిద్ధం యాత్ర విజయవంతంగా ముగిసింది.

గంజాయి విక్రేతకు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా

నగరంపాలెం: గంజాయి విక్రేతకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ గుంటూరు మొదటి అదనపు జిల్లా జడ్జి సీహెచ్ రాజగోపాలరావు సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మేడికొండూరు మండలం డొకి పర్రు గ్రామానికి చెందిన ఆర్.బుల్లయ్య ఇంట్లో 2017లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సత్తెనపల్లి అప్పటి సీఐ ఎం.రమేష్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. 21.1 కిలోల గంజాయి గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదుచేశారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎన్‌డీపీఎస్) తన్నీరు సాంబశివరావు కేసు వాదించారు.





రూ.2 కోట్లు దాటిన స్వాధీన సొత్తు

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులు, మద్యం తదితర వాటి విలువ రూ.2,00,49,180కు చేరింది. ప్రత్తిపాడు నియోజకవర్గ పరధిలో రూ.2.54 లక్షలు, తెనాలి పరిధిలో రూ.3.34 లక్షలను సోమవారం తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి.



12న ఏటుకూరులో 'మేమంతా సిద్ధం' సభ

సభా స్థలి పరిశీలించిన ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, విప్ లేళ్ల అప్పిరెడ్డి, అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గం ఏటుకూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఈ నెల 12న గుంటూరు జిల్లాకు సంబంధించి జరగనున్న మేమంతా సిద్ధం సభా ప్రాంగణాన్ని సోమవారం రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 12న మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. కూటమికి ఓటేస్తే పులి నోట్లో తల పెట్టినట్లేనని, ఈ వాస్తవం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. అందుకే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, తిరుగులేని విజయాన్ని అందించాలని, తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని వారు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. 'వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు మీరంతా సిద్ధమేనా..?' అన్న జగనన్న ప్రశ్నకు 'అవును.. మేమంతా సిద్ధం.' అన్న సమాధానం రాష్ట్రంలో ఒక నినాదమై మార్మోగుతోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన సీఎం బస్సు యాత్రకు ఊళ్లకు ఊళ్లు తరలిరావడం... 'మేమంతా సిద్ధం' సభలకు జనం సంద్రంలా పోటెత్తడం ప్రత్యక్ష నిదర్శనాలన్నారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, మిర్చి యార్డు డైరెక్టర్ ఇంద్ర ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం


గంధం ఊరేగింపు ప్రారంభంలో నిర్వాహకులు

పెదకాకాని: పెదకాకానిలోని సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 536వ ఉరుసు మహోత్సవం కనుల పండువగా ప్రారంభమైంది. రాష్ట్ర నలు మూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దర్గాలో సోమవారం తెల్లవారు జామున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదం షఫీ, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాష ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు షఫా బావి నీటితో స్నానాలు ఆచరించి, దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం 5 గంటలకు బాజీ బాబా వారి గుఱ్ఱం దర్గాలో ప్రదక్షిణలు చేసింది. రాత్రి పెదకాకాని పొలిమేర సెంటర్ జెండా చెట్టు నుంచి ప్రత్యేక చాందినీ అలంకరణలో గంధం బిందెలతో బాజీబాబా వారి గుఱ్ఱం ఊరేగింపు ప్రారంభమైంది. పుర వీధుల్లో భక్తులు బాబా వారి గుఱ్ఱంకు మిఠాయిలు, కొబ్బరి కాయలు, పూలమాలలు, పూజా సామగ్రి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం అన్నదానం, తాగునీరు టెంట్లు ఏర్పాటు చేశారు. ఊరేగింపు ముగించుకుని బాబావారి గుఱ్ఱం మంగళవారం సాయంత్రం 4 గంటలకు దర్గాకు చేరుకుంటుందని, అనంతరం భక్తులకు గంధం పంచి పెట్టడం, సలామి ప్రార్థనలతో ఉరుసు మహోత్సవం ముగుస్తుందని ఈఓ షేక్ ముక్తార్ బాష తెలిపారు. రూ.2 కోట్లతో సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సీఈఓ షేక్ అబ్దుల్ ఖాదరి పాల్గొన్నారు.

మహిళా లోకం మెచ్చిన నేత జగనన్న

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీలో 50 కుటుంబాల చేరిక


పార్టీలో చేరిన మహిళలతో మంత్రి విడదల రజిని

నెహ్రూనగర్: మహిళా లోకం మెచ్చిన నాయకుడు సీఎం జగనన్న అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు వెస్ట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి విడదల రజిని అన్నారు. నగరంలోని 28వ డివిజన్ సీతమ్మ కాలనీలో మహిళా నాయకురాలు వల్లెపు రమాదేవి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాల మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మంత్రి రజిని వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో సీఎం వైఎస్ జగన్ మహిళలకు అగ్ర తాంబూలం ఇచ్చారన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, డ్వాక్రా రుణ మాఫీ, మహిళల పేరుతో ఇళ్ల పట్టాల పంపిణీ వంటి పథకాలతో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయనను రానున్న ఎన్నికల్లో ఆడపడుచులే గెలిపించుకుంటారన్నారు. మహిళల మద్దతుతో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్నారు. చేశారు.

20 తమిళ కుటుంబాల చేరిక

సీతమ్మ కాలనీలోని స్థానిక నాయకుడు రవి ఆధ్వర్యంలో 20 తమిళ కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తామంతా ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. వారిని పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి విడదల రజిని స్పందిస్తూ.. జగనన్న పాలన చూసి ఏ రాష్ట్రం వారైన మెచ్చుకోక తప్పదన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, బూత్ కన్వీనర్ దాసరి రమేష్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో జగన్నాథ ప్రసన్న, వి.ఏసమ్మ, జి.వాణి, వల్లూరి దేవి, మేడా వెంకాయమ్మ, మేడా నాగమణి, దేవళ్ల మంగమ్మ, బత్తుల లక్ష్మి, తమ్మిశెట్టి రమణ, వి.గోవిందమ్మ, ఉప్పు కుమారి, డి.సుజాత, డి.వెంకటలక్ష్మి, చల్లా తిరుపతమ్మ ఉన్నారు.







తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు

గుంటూరు వెస్ట్ : వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ కుడి కాలువ, కృష్ణా వెస్ట్రన్ డెల్టా కెనాల్ పరిధిలో జిల్లాకు నీటి విడుదల జరిగిందని తెలిపారు. టెయిల్ ఎండ్ నుంచి ప్రారంభించి చెరువులు, ట్యాంకులు నింపుతున్నామన్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు. ప్రతి రోజూ నివేదికలు తీసుకుంటున్నామన్నారు. నీటిని పూర్తిస్థాయిలో స్టోరేజ్ చేసే వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. శివారు, నీటి ఎద్దడి గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఉమా మహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్, డ్వామా పీడీ పద్మావతి, డీపీఓ శ్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



పొన్నూరు: పట్టణంలోని డీవీసీ కాలనీ శివారు ప్రాంతంలో యువకుడి హత్య ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ పి.భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సీఐ వివరాల మేరకు..డీవీసీ కాలనీకి చెందిన యాజిలి గోపి(33) ఆదివారం అర్ధరాత్రి హత్యకు గురైనట్లు తెలిపారు. మృతుడు గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యార్డుకు 1,40,056 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,40,056 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,29,547 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం–334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8వేలు నుంచి రూ. 18,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8వేల నుంచి రూ.19,500ల వరకు లభించింది. తాలు మిర్చికి రూ.5 వేలు నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,599 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.



